క్లుప్తంగా

పార్టీ కోసం అందరినీ కలుపుకొని పనిచేస్తా

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి


సంగెం నర్సిరెడ్డి

యాలాల: కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం అందరినీ కలుపుకుని పనిచేస్తానని మండల అధ్యక్షుడు సంగెం నర్సిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం 'పార్టీ కార్యక్రమాలకు దూరం దూరం' అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి ఖండించారు. ఇటీవల మండల కేంద్రంలో బీసీ రిజర్వేషన్ తీర్మానం అమలుపై పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వ్యక్తిగత కారణాలతో హాజరుకాలేకపోయానని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచే అభ్యర్థుల గెలుపు కోసం అందరిని కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశా రు. పార్టీ తరపున మండలంలోని కార్యకర్తలు, యువకులు, కీలక నాయకులతో కలిసి పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాలాల మండలం నుంచి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కానుకగా ఇస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి


ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

కొడంగల్: అప్పాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లి బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. అప్పాయిపల్లి గ్రామంలో ప్రభుత్వం మెడికల్ కళాశాలను నిర్మించడానికి రైతుల నుంచి భూములు సేకరించిన విషయం గురించి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పరిహారం ఇవ్వలేదని ఆయన దృష్టికి తెచ్చారు. ఎకరాకు రూ.10 లక్షలు, 125 గజాల ప్లాటు, ఉద్యోగం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. న్యాయ బద్ధంగా తమకు రావాల్సిన పరిహారాన్ని ప్రభుత్వం నుంచి ఇప్పించాలని వారు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అప్పాయిపల్లికి చెందిన శ్రీనివాస్, అగ్గనూర్ మల్లప్ప, అమృతప్ప, ఆశమ్మ, బసప్ప, వెంకటమ్మ, నర్సిములు తదితరులు ఉన్నారు.

వర్సిటీల్లో పాత పద్ధతిలోనే ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్

లక్ష్మీకాపూల్: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో చేపట్టే ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్‌ను పాత పద్ధతిలోనే చేపట్టాలని తెలంగాణ స్టేట్ డాక్టరేట్స్ అసోసియేషన్ (టీజీడీఏ) డిమాండ్ చేసింది. స్క్రీనింగ్ టెస్టుల పేరుతో రిక్రూట్‌మెంట్‌ను వివాదాస్పదం చేయకుండా యూజీసీ నిబంధనల మేరకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియను చేపట్టాలని సూచించింది. 15 ఏళ్లుగా యూనివర్సిటీల్లో ఎలాంటి రిక్రూట్‌మెంట్లు లేక ఆందోళన చెందుతున్న నిరుద్యోగుల బాధలను, సమస్యలను గుర్తించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పాలాడి రమణరావు, అధ్యక్షులు డాక్టర్ పి.నరేందర్ రెడ్డిలు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత ఉండాలి

కొందుర్గు: మహిళల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత ఉండాలని డీపీఎం స్వర్ణలత సూచించారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య సమీక్షా సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఇందుకు ప్రత్యేకమైన యాప్ రూపొందించిందని, ఈ యాప్‌లో మహిళా సంఘాల సభ్యుల పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. నమోదు సమయంలో మహిళల సమగ్ర సమాచారాన్ని ఎంటర్ చేయాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులను లక్షాధికారులను చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జయమాలిని, సీసీలు, వివిధ గ్రామాల మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

చేవెళ్ల: పామెన గ్రామంలో గ్రామ దేవతల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామంలో దుర్గమ్మ, సరోజనమ్మ, మైసమ్మ దేవతల ఆలయాలను నూతనంగా నిర్మించి విగ్రహ ప్రతిష్ఠాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో నాలుగురోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజు శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు.

కొడంగల్ ఆస్పత్రికి మహర్దశ

శిక్షణా వైద్యశాలగా అప్‌గ్రేడ్

- మెడికల్ కళాశాలకు అనుబంధంగా టీచింగ్ ఆస్పత్రి
- త్వరలో ఆయుష్ మెడికల్ కళాశాల


నిర్మాణంలో ఉన్న కొడంగల్ టీచింగ్ ఆసుపత్రి


నిర్మాణంలోని భవనాలు

కొడంగల్: గతంలో ధర్మాసుపత్రిగా పేరుగాంచిన కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి మహర్దశ పట్టనుంది. మండల పరిధిలోని అప్పాయిపల్లిలో నిర్మించనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా శిక్షణా వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిర్మాణ పనుల్లో వేగం పుంజుకుంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా టీచింగ్ హాస్పిటల్‌ను నిర్మిస్తున్నారు. దీని కోసం కొడంగల్ ప్రభుత్వాసుపత్రిని ఎంపిక చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఖాళీ స్థలం ఉండడంతో ఇక్కడే టీచింగ్ ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిపై భాగంలో మరిన్ని ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. తెలంగాణా వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. భవన నిర్మాణ పనులకు రూ.27 కోట్లు మంజూరు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆసుపత్రిపై దృష్టి పెట్టి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో నిత్యం మాట్లాడుతున్నారు. పనులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని సూచిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం మెడికల్ కళాశాల సీట్లను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నిర్దేశిత ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అప్పాయిపల్లిలో మెడికల్ కళాశాల

మండల పరిధిలోని అప్పాయిపల్లి శివారులో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించడానికి సర్వే నంబర్ 19లో 55 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని సేకరించారు. అక్కడే మెడికల్ కళాశాల, వెటర్నరీ యూనివర్సిటీను నిర్మించనున్నారు. భవనాలు మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.124.50 కోట్లు మంజూరు చేసింది. అక్కడే ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి రూ.46 కోట్లు మంజూరు చేశారు. ఫిజియోథెరఫీ కళాశాలను, పారామెడికల్ కళాశాలను మంజూరు చేశారు. వీటి నిర్మాణం కోసం రూ.27 కోట్లు కేటాయించారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిని విస్తరించి 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావించారు. ఈ మేరకు కొడంగల్‌ను మెడికల్ హబ్‌గా మారుస్తున్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గానికి త్వరలో ఆయుష్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి, పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేసే అవకాశం ఉందని అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, నేచరోపతి (బీఏఎమ్‌ఎస్, బీహెచ్‌ఎమ్‌ఎస్, బీయూఎమ్‌ఎస్, బీఎన్‌ఎమ్‌ఎస్) కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయుష్ ఆసుపత్రులను బలోపేతం చేసి ఆయుష్ డాక్టర్లను నియమిస్తారు. గతంలో జిల్లాలో అనేక గ్రామాలు, మండలాల్లో ఆయుర్వేద, హోమియోపతి ఆసుపత్రులు ఉన్నాయి. అయితే ఈ ఆసుపత్రుల్లో డాక్టర్లు లేరు. మందులు లేవు. వైద్య సిబ్బంది నియామకం జరగలేదు. ఆయుర్వేదానికి పూర్వ వైభవం తేవడానికి రేవంత్ సర్కార్ కృషి చేస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకున్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటున్నారు. ప్రతి గురువారం జనరల్ సర్జరీలు చేస్తున్నారు. ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర ప్రియ కోరారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వాసుపత్రికి రావాలని సూచిస్తున్నారు.

ఫైలేరియాపై అవగాహన

ముమ్మరంగా రక్తనమూనాల సేకరణ


అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ అధికారి ఫకీరప్ప

బొంరాస్‌పేట: 'దోమలు పుట్టరాదు.. కుట్టరాదు' అనే నినాదంతో గ్రామాల్లో ఫైలేరియాపై అవగాహన కల్పిస్తున్నామని సబ్ యూనిట్ అధికారి ఫకీరప్ప తెలిపారు. ఈ నెల 3నుంచి కొడంగల్ ప్రాంతంలోని దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిలోని ఎంపిక గ్రామాల్లో ప్రజలకు ఫైలేరియాపై అవగాహన కల్పించామన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని రేగడిమైలారంలో ముమ్మరంగా రక్తనమూనాల సేకరణ చేశారు. పరిసరాల శుభ్రత, మురుగునీరు చేరకుండా చర్యలు, దోమల పుట్టుక, వాటి నివారణపై అవగాహన కల్పించారు. గ్రామంలో 114 మంది నుంచి రక్తపు నమూనాలు సేకరించారు. మరో వారం రోజుల్లో ఫలితాలు అందుతాయన్నారు. ఈ నెల 11 వరకు అవగాహన, రక్తపు నమూనాలు సేకరించనున్నామన్నారు. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం పద్మావతి, ఆశా కార్యకర్తలు అనిత, నాగమణి, చంద్రబాయిలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

దుద్యాల్: సీఎం సహాయ నిధి పేదలకు వరంమని మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంత్రికుంట తండాకు చెందిన సాల్య నాయక్‌కు మంజూరైన రూ.70వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి తిరుపతి రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలు అనారోగ్యంతో ఆసుపత్రుల పాలైతే మెరుగైన చికిత్స కోసం ఈ నిధి ఉపయోగ పడుతుందన్నారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని తుంకిమెట్లకు చెందిన బెస్త లక్ష్మికి రూ.1లక్ష, బొర్ర మశప్పకు రూ.33,500 సీఎం సహాయనిధి మంజూరైన పత్రాలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు హనీఫ్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దుద్యాల్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందుకుంటున్న సాల్య నాయక్


బొంరాస్‌పేట: సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తు నాయకులు



బొంరాస్‌పేట: విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ హరిలాల్

అర్హత పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

అభినందించిన ఎంఈఓ హరిలాల్

బొంరాస్‌పేట: ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంఈఓ హరిలాల్ వారిని సన్మానించి అభినందించారు. పాఠశాల నుంచి ఎనిమిదోతరగతి విద్యార్థులు ఇస్లావత్ తరుణ్, అఖిల్, శివమణి, సాక్షి, సహస్ర స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారు. అందుకు ప్రత్యే క కృషి చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎంఈఓ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, మల్లయ్య, అనిల్‌కుమార్, వెంకటయ్య, భవానీ పాల్గొన్నారు.

దుద్యాల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన విద్యార్థిని ఎంపికయ్యింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వర్షిణి స్కాలర్‌షిప్‌కు ఎంపికవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వర్షిణిని పాఠశాల ఉపాధ్యాయులు,తోటి విద్యార్థులు అభినందించారు.



దుద్యాల్: విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడా అధికారి వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గాయత్రి, వెంకట్‌రావు, వెంకట్‌రెడ్డి, వీరన్న, విజయ్‌కుమార్, దస్తప్ప, కొటంరాములు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

మందకృష్ణ మాదిగకు సన్మానం


మందకృష్ణకు బొకే ఇచ్చి అభినందిస్తున్న నాయకులు

పరిగి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను ఆయన నివాసంలో శుక్రవారం పరిగి పట్టణ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను సాధించి ఎస్సీలకు ఎంతో మేలు చేశాడని ఆయనను కొనియాడారు. మాదిగల సత్తా ఎంటో ప్రభుత్వాలకు చాటి చెప్పిన గొప్ప ప్రజా సేవకుడు మంద కృష్ణ మాదిగ అని వారు పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో పరిగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, లక్నాపూర్ శ్రీనివాస్, వినోద్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల, మధురాపూర్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువుతో పాటుగా హిమోగ్లోబిన్ పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ... విద్యార్థులు తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతంలో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. తాజా కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్‌ఎం హసీనా, ల్యాబ్ టెక్నీషియన్‌లు సదాశివరెడ్డి, స్నేహశ్రీ, ప్రగతి సీనియర్ మేనేజర్ మురళీకృష్ణ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శంకర్, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ప్రగతి సిబ్బంది జగదీష్, శ్రీకాంత్, కార్తీక్, తులసి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడుతూ..తాండూరు మండలంలోని అన్ని గ్రామాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆయా గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు వెచ్చిస్తున్నారన్నారు. గౌతపూర్ గ్రామంలో జెన్నె లక్ష్మప్ప ఇంటి నుంచి హన్‌మాన్ దేవాలయం వరకు, జెన్నెరాములు ఇంటి నుంచి ఈడ్గి నర్సిములు, కుర్వ వెంకటేశం ఇంటి నుంచి కుర్వరాజు ఇంటి వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కొంపల్లి శ్రీనివాస్, రాంచంద్రారెడ్డి, మల్లారెడ్డి, జెన్నె నాగప్ప, రాములు, దస్తప్ప, జయప్ప, జెన్నె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని చౌడాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ నిధులు రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభ్యున్నతికి ప్రాధాన్యతనిచ్చి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతీ గ్రామంలోని కాలనీకి సీసీరోడ్లను నిర్మించి పల్లెలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తాము కృషిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, చెవ్వ యాదయ్య, ఎరుకలి యాదయ్య, సలీం, లింగం, రషీద్, వెంకట్, హన్మంతు, చెన్నయ్య, కృష్ణయ్య, రాములు, బ్రహ్మం, వైద్యనాథం, పాల రాజశేఖర్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.


తాండూరు రూరల్: సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాగప్ప తదితరులు


కుల్కచర్ల: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తిభావం అలవర్చుకోవాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి 64వ వార్షికోత్సవాలలో భాగంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేకపూజలు చేసి పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంతోశ్, గ్రామస్తులు అనంతయ్య, చంద్రభూపాల్, కృష్ణయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


పల్లకీసేవలో ఆంజనేయులు ముదిరాజ్

అభివృద్ధి పనులకు సమష్టి కృషి


కమిషనర్‌ను సన్మానిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకులు

మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్‌రూరల్: నూతనంగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా పని చేసి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ సూచించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో మొదటిసారిగా ఉద్యోగులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహిస్తూ, ఎండా కాలంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే మున్సిపాలిటీ మేనేజర్లుగా ఎస్.కె.జమిల్ అహ్మద్, వెంకటయ్య, ఎంఈపీఎంఏ సెక్షన్ అధికారిగా సంధ్యారాణి, రెవెన్యూ సెక్షన్ సుదర్శన్, టౌన్‌ప్లానింగ్ వెంకటేశ్వర్‌రెడ్డి, శానిటేషన్ అధికారిగా వెంకటేశం శాఖల వారీగా నియమించారు. నిత్యం కేటాయించిన శాఖలను బట్టి అధికారులు తమ పనుల్లో నిమగ్నం కావాలని సూచించారు. అనంతరం కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌ను ఉద్యోగులు, కార్మికులు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కారోబార్‌లు రాఘవేందర్, శ్రావణ్‌కుమార్, లక్ష్మి, పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. అంతకుముందు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో నేతలు కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

• చిన్నారులకు అక్షరాభ్యాసం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం కాముని పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు ప్రాథమిక దశలో అక్షరాలను గుర్తించేలా విద్యాబోధన చేయాలన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి నిధుల మంజూరు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు వైద్యాధికారిణి అమూల్య తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధిలో భాగంగా మరమ్మతులకుగాను ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నేడు కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం గ్రామంలోని రైతు వేదిక వద్ద కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు కుమ్మర సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మరి పాండు, అనంతయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దయానంద్, జిల్లా అధ్యక్షుడు మారుతి హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన కుమ్మర సోదరులు పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

రాంపూర్ దర్గాలో ఉర్సు

బంట్వారం: కోట్‌పల్లి మండలం రాంపూర్ దర్గా సోఫిపీర్ ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ప్రారంభమైన ఈ ఉర్సు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. శుక్రవారం రెండో రోజు దర్గాలో వివిధ కార్యక్రమాలు చేపట్టి భక్తులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 8వ తేదీ తెల్లవారుజామున హల్కా షరీఫ్, ఖవ్వాలి ఫాతెహ ఉంటుందని పేర్కొన్నారు.



ఘనంగా శివ స్వాముల పడిపూజ

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో శివ స్వాములు పడిపూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీనాథ్ శివ స్వామి ఇంట్లో నిర్వహించిన పూజలో శివనామ స్మరణతో మారుమోగింది. స్వామి వారికి పంచామృతాభిషేకం, బిల్వష్టం, శివాష్టకం వంటి పూజలు నిర్వహించారు. ఈ పూజకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన 150 మంది స్వాములు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.